
# పెళ్లి

కౌనకళ్ళ జయలక్ష్మి



రాజమండ్రి
**8-3-84**

గౌరవనీయులయిన శ్రీ పాండురంగారావుగారికి

నమస్తే! నేను మీకు అపరిచితుణ్ణి అయినప్పటికీ, మీకు అత్యంత సన్నిహితుడయిన, శ్రీ వీరభద్రరావు ప్రోత్సాహంతో యీ ఉత్తరం వ్రాస్తున్నాను. వీరభద్రుడు నాకు కూడా బాగా సన్నిహితుడు. మీ గురించి తరచు చెబుతూవుంటాడు. నా గురించి, మా కుటుంబ పరిస్థితుల గురించి కూడా మీకు చెప్పే వుంటాడు.

మీ రెండవ అబ్బాయికి, మా అమ్మాయిని యిచ్చి వివాహం చేస్తే ఎంతో బాగుంటుందని— ఈడూ, జోడూ, చూడముచ్చటగా వుంటుందని, వీరభద్రుడు ఎప్పుడూ అంటుంటాడు. ఈ ఉత్తరం వ్రాయటంలోని ముఖ్యోద్దేశం కూడా అదే!

పోతే—నా గురించి, మా కుటుంబ పరిస్థితుల గురించి మీకు తెలియజేయటం ఎంతయినా అవసరంగా భావిస్తున్నాను నేను యిక్కడి పేపరు మిల్లులో ఎక్కౌంట్సు సెక్షన్ ఇన్‌చార్జ్‌గా పని చేస్తున్నాను. గత పదిహేను సంవత్సరాలుగా ఈ మిల్లులోనే పని చేస్తున్నాను. నాకు ఒక అబ్బాయి, యిద్దరు అమ్మాయిలు. పెద్ద అమ్మాయికి వివాహం అయ్యింది. అల్లుడు ఎమ్.ఎస్సి.—లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. అమ్మాయి తరువాత, అబ్బాయి, కంప్యూటర్ సైన్స్‌లో ఎమ్.టెక్ చేశాడు. టాటా కన్సల్‌టెన్సీలో ప్రస్తుతం వర్క్ చేస్తున్నాడు. ఆఖరి అమ్మాయి, బి.యస్సి-బి.యిడి చేసింది. ఈ అమ్మాయినే-మీ రెండవ అబ్బాయికి యివ్వాలని మా ఆకాంక్ష!

అమ్మాయికి 22 సంవత్సరాలు. ఎత్తు, 5 అడుగుల మూడు అంగుళాలు. అందంగానే వుంటుంది.

నాకు యిద్దరు అన్నలు, ఒక తమ్ముడు, చెల్లి-వున్నారు. అందరూ కూడా, చాలా మంచి హోదాగల ఉద్యోగాలలో స్థిరపడ్డవారే! మా పెద్ద అన్నగారు ఆర్ అండ్ బిలో ఎక్జిక్యూటివ్ ఇంజనీరు. మా రెండవ అన్నగారు గవర్నమెంటు కాలేజీ ప్రిన్స్‌పాల్‌గా చేస్తున్నారు. తమ్ముడు ఇంజనీరు. ఇక్కడి పేపరు మిల్లులోనే చేస్తున్నాడు. చెల్లి స్టేట్ బాంక్‌లో వర్క్ చేస్తుంది. నా భార్య తరపు బంధువర్గం అంతా కూడా చాలా ఎడ్యుకేటెడ్.

మీ కుటుంబంలో కూడా అంతా మంచి చదువులు చదివినవారని, మంచి, మంచి ఉద్యోగాలలో స్థిరపడినవారేనని, వీరభద్రుడు చెబుతూ

వుంటాడు. చాలా సంతోషం

మన కుటుంబాల మధ్య—ఈ పిల్లల వివాహంతో బాంధవ్యం ఏర్పడాలని ఆకాంక్షిస్తున్నాను.

మీ వీలునిబట్టి ఒకసారి....రాజమండ్రికి వస్తే, అమ్మాయిని చూసి వెళ్ళవచ్చు. తప్పనిసరిగా వస్తారని తలుస్తాను.

ఉత్తరం వ్రాయించగోర్తాను.

—ముకుందరావు.

❋

రాజమండ్రి
15–4–84

గౌరవ శ్రీ పాండురంగారావుగార్కి, ముకుందరావు నమస్కరించి వ్రాయునది—


ఓ నెల రోజుల క్రితం నేను మీకు ఒక ఉత్తరం వ్రాశాను. అది అందేవుంటుందని తలుస్తాను. మా అమ్మాయిని మీ రెండవ అబ్బాయికి యిచ్చి వివాహం చేయాలనే తలంపుతో, మా కుటుంబ పరిస్థితులన్నీ మీకు వివరించాను ఆ ఉత్తరంలో.

కానీ ఎందుచేతనో మీనుంచి ఏ విధమయిన సమాధానం రాలేదు. మీరు వస్తారని కూడా ఎదురుచూశాం. కానీ, రాలేదు మీరు.

అమ్మాయి గురించి ఎక్కువగా వ్రాస్తే గొప్పలు చెప్పుకున్నట్లుంటుందని అంతగా వ్రాయలేదు. మరి అమ్మాయిని గురించిన వివరాలు పూర్తిగా తెలియకపోవటం వల్ల మీరు యీ విషయంలో అంత ఆసక్తి చూపలేదేమోనని, యీ ఉత్తరం వ్రాస్తున్నాను.

అమ్మాయి బియస్సి, బియిడి చేసింది. ప్రస్తుతం ఖాళీగా వుంది. అబ్బాయికి అభ్యంతరం లేకపోతే జాబ్ చేస్తుంది.

చాలా తెల్లగా వుంటుంది. అందమయిన ముఖం.



చాలా మంచి హాబీస్ వున్నాయి అమ్మాయికి. సంగీతంలో ప్రావీణ్యం వుంది. బాగా పాడుతుంది. వీణ చాలా బాగా వాయిస్తుంది. కాలేజీలో చాలాసార్లు బహుమతులు పొందింది. చిత్రలేఖనంలో కూడా ఎన్నో బహుమతులు పొందింది.

వీటితోబాటు ఇంటి పనులు చక్కగా చేయగలదు. అన్నిరకాల వంటలు చేయగలదు. అమ్మాయి చేసిన క్రొత్త వంటలను అన్నిరకాల పత్రికలు ప్రచురించాయి.

అప్పుడప్పుడూ పత్రికలకు కథలు కూడా వ్రాస్తుంది. "శ్రీసంధ్య" కలం పేరుతో ప్రచురింపబడే కథలు అమ్మాయి వ్రాసినవే.

దయచేసి మీరు ఒకసారి వచ్చి అమ్మాయిని చూసి వెళితే ఎంతయినా కృతజ్ఞుడిని. వీరభద్రుడు కూడా మీకు ఉత్తరం వ్రాసే వుంటాడు.

తప్పక వస్తారని ఆకాంక్షిస్తాను.

—ముకుందరావు

రాజమండ్రి
29–5–84

శ్రీ పాండురంగారావుగార్కి,

నేను యింతకుముందు మీకు రెండు ఉత్తరాలు వ్రాశాను. నెలలు గడిచిపోయినా మీ నుండి సమాధానం రాకపోవటంతో—తిరిగి యీ ఉత్తరం వ్రాస్తున్నాను.

నా మొదటి ఉత్తరంలో మా కుటుంబంయొక్క మంచి చెడ్డలు వివరంగా వ్రాశాను.

నా రెండవ ఉత్తరంలో అమ్మాయిని గురించిన వివరాలు పూర్తిగా తెలియజేశాను.

అయినా మీ నుంచి ఉత్తరం రాలేదు. కారణం, నేను ఊహించగలను. మా కుటుంబంలో పేరు పెట్టగల లోపంలేదు. అమ్మాయి అందచందాలలోను, చదువు సంస్కారం యితర విషయాల్లోను—ఏ అమ్మాయికీ తీసిపోదు! ఈ విషయాలు మీకు తెల్పినా మౌనం వహించారంటే—మరో విషయం మీకు వ్రాయకపోవటమే ముఖ్య కారణం అని భావిస్తున్నాను. అందుకే ఖచ్చితంగా వ్రాస్తున్నాను.

అమ్మాయికి లక్షరూపాయలు కట్నంగా యిస్తాము. పాతిక కాసుల వరకూ బంగారం పెడతాము. ఆడపడుచు కట్నంగా పదివేలు యివ్వాలని అనుకుంటున్నాము. అబ్బాయి సూటు నిమిత్తం ఎంత అయితే అంత సొమ్ము మేమే యిస్తాము. పెండ్లి అయ్యాక కాపురం పెట్టే సమయంలో ఇంట్లోకి కావలసిన సామగ్రి అంతా మేమే అమర్చిపెడతాము.

మీకు నచ్చితే ఒకసారి వచ్చి మాతో సంప్రదించి వెళ్ళవచ్చు—

—ముకుందరావు

*

విజయవాడ
31–5–84

గౌ॥ శ్రీ ముకుందరావుగార్కి,

పాండురంగారావు అనేక నమస్కారములతో వ్రాయునది—

మీరు వ్రాసిన మూడు ఉత్తరములు అందినవి. కొన్ని కారణాలవల్ల ఉత్తరం వ్రాయనందుకు మన్నించగలరు. మీ మూడవ ఉత్తరం అందిన వెంటనే యీ సమాధానం మీకు వ్రాస్తున్నాను.

అబ్బాయితో సహా – మేము, రేపు 5-6-84 వ తేదీన రాజమండ్రి వస్తున్నాము. అబ్బాయికి అమ్మాయి, అమ్మాయికి అబ్బాయి, నచ్చితే–అదే రోజు తాంబూలాలు తీసుకుందాము. మీతో సంబంధం అందుకోవటానికి – మేము ఎంతో ఆనందిస్తున్నాము.

అన్ని వివరాలు స్వయంగా మాట్లాడుకుందాము.

శుభాకాంక్షలతో,

—పాండురంగారావు

*

రాజమండ్రి

6-6-84

శ్రీ పాండురంగారావు గార్కి,

మీరు, కుటుంబ సమేతంగా, మా అమ్మాయిని చూడటానికి వచ్చినందుకు కృతజ్ఞులం. మీరు, మీ ఉత్తరంలో వ్రాసినట్లు అయిదవ తేదీకి, అబ్బాయితో సహా వచ్చినందుకు సంతోషం.

నేను మీకు ముందుగా ఒక ఉత్తరం వ్రాశాను. అందులో మా కుటుంబం గురించి, మా బంధువర్గం గురించి—పూర్తిగా వివరించాను. కానీ మేమంతా, ఎంత ఉన్నత స్థానాలలోవున్నా, మాది ఎంత సంస్కారవంతమయిన కుటుంబం అయినా, మీకు అవసరం లేకపోయింది! నా రెండవ ఉత్తరంలో, అమ్మాయి అందచందాలు చదువు వివరాలు, హాబీలు పూర్తిగా వ్రాశాను. కానీ, అమ్మాయి గుణగణాల విషయంలో గాని, అందచందాల విషయంలో గాని, మీకు అంత పట్టింపువున్నట్లు కన్పించ లేదు. నా మూడవ ఉత్తరం మాత్రం, మిమ్మల్ని కదిలించింది? హడావిడి పెట్టింది!! వెంటనే బయలుదేరేలా చేసింది!!! కారణం??? అది, లక్ష రూపాయిల విలువయిన ఉత్తరం మరి! లక్ష రూపాయలే కాక, పాతిక వేలు ఖరీదుచేసే బంగారం, యింకా ఎన్నో బహుమతులతో చేరిన ఉత్తరం కాబట్టి, వెంటనే తొందరపడేలా చేసింది మిమ్మల్ని! కానీ పాండురంగారావు గారూ కేవలం డబ్బుకే ప్రాధాన్యత యిచ్చే మీతో సంబంధం అందుకోవటానికి మాత్రం మేము తొందరపడటం లేదు.

మేము ఆశించేది మా అమ్మాయిని, తల్లిదండ్రుల్లా చూసుకునే అత్త మామల్ని.

అంతేగాని, ఎంతరేటు ఎక్కువ రాబట్టాలా? అని చూసే దళారీలను మాత్రం కాదు. మీతో వియ్యం అందుకోవటం యిష్టంలేకనే అమ్మాయిని మీకు చూపలేదు.

అనుకోని కారణాల వల్ల మా అన్నయ్యగారి వూరు వెళ్ళిందని—ఆ రోజు మీకు చెప్పిన విషయం అబద్ధం.

కానీ, అమ్మాయిని చూడకపోయినప్పటికీ, కేవలం ఫొటో చూసి–తాంబూలాలు తీసుకొనే నిర్ణయానికి వచ్చారు మీరు. అంటే—అమ్మాయి గురించి మీకు ఏ విధమయిన పట్టింపు లేదన్నమాట!

మీరు పట్టించుకొనేది కేవలం లక్ష రూపాయిల కట్నం-బంగారమూను! అంతేగా?




భార్యా భర్తలిద్దరూ బీచిలో సరదాగా నడుస్తున్నారు. ఇంతలో వారికి ఎదురుగా ఒకామె రావడం గమనించిన భర్త తన భార్యతో–

"కాస్త అందంగా నవ్వుతూ, హుందాగా నడు.... ఆ ఎదురుగా వస్తున్నావిడ నిన్ను చూసి అసూయపడాలి" అన్నాడు.

"నన్ను చూసి అవిడెందుకు అసూయ పడాలి?" విస్మయంగా అడిగింది భార్యామణి.

"ఆవిడ నా మాజీ భార్య కాబట్టి"

---

కేవలం డబ్బుకు ముడి పడిపోయిన మీరు - మీ పుత్రుడు – మా అమ్మాయిని ఎంత సుఖపెట్టగలరో మేం ఊహించగలం! అందుకే మేం ఒక నిర్ణయానికి వచ్చాం.

ఈ వివాహానికి మీరు సిద్ధంగా వున్నప్పటికీ మేము మాత్రం సంసిద్ధంగా లేము. ఈ విషయం తెల్పటానికి చింతిస్తున్నాను.

మాకంటే కూడా ఎక్కువ కట్నం యివ్వగల మరెంతోమంది అమ్మాయిల తల్లిదండ్రులు మీ అబ్బాయికోసం 'క్యూ'లో నిలబడతారు. మీ అబ్బాయిని ఆ 'క్యూ' ముందు నిలబెట్టి, వేలం వేయండి!

ఎంత ఎక్కువ పలికితే అంతా రాబట్టి ఆ తర్వాతే వివాహం చేయండి!

నా తాహతుకి నేనివ్వగల కట్నంతో ఒక సంబంధం నిశ్చయం చేశాను మా అమ్మాయికి.

అబ్బాయి, మీ అబ్బాయిలా ఇంజనీరు కాదు. చిన్న ఎలిమెంటరీ స్కూలు టీచరు.

అయినా, అమ్మాయిని ప్రేమగా చూసుకునే సంస్కారవంతుడు.

అబ్బాయి తల్లితండ్రులు దురాశాపరులు, దళారీలు మాత్రం కాదు!

అమ్మాయిని స్వంత కూతురిలా చూసుకునే ప్రేమమూర్తులు!!

మా అమ్మాయిలాంటి సౌశీలవతులని, కేవలం 'డబ్బు' ఆశతో కోల్పోతున్న దురదృష్టవంతులని తలుచుకుంటే జాలి వేస్తుంది నాకు; మా అమ్మాయి అదృష్టానికి సంతోషం కల్గుతుంది మరి.

శలవు

—ముకుందరావు